తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## కుక్కపిల్లను కాపాడపోయి
# నీటమునిగి యువకుడు మృతి



భాకరాపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త

చిన్నగొట్టిగల్లు ఇందిరా నగర్‌కు చెందిన సంతోష్ కుమార్ (40)అతని భార్య మాలతి కుమార్తెతో కలిసి తన ఆటోలో నెల్లిట్లవారిపల్లి పంచాయతీ రెడ్డి చెరువు కు బట్టలు ఉతకడానికి వెళ్లి తనతో పాటు తెచ్చుకున్న కుక్కపిల్లను ఈత ఆడిస్తూ అది మునిగిపోతుండడంతో దాన్ని కాపాడుపోయి సంతోష్ కుమార్ నీట మునిగి చనిపోయాడని రాబడిన సమాచారం మేరకు భాక రాపేట ఎస్సై రాజా పవన్ కుమార్ తన సిబ్బందితో చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తద్వారా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ప్రయోగ విజయం స్ఫూర్తినిచ్చింది
### - ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్



విజయ సూచికతో ఇస్రో శాస్త్రవేత్తలు, ఇస్రో ఛైర్మన్

సూళ్లూరుపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త

ఎల్‌వీఎం3-ఎం6 ప్రయోగ విజయం భవిష్యత్ ప్రయోగాల నిర్వహణకు నమ్మకంతో పాటు స్ఫూర్తినిచ్చిందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. బుధవారం ఎల్‌వీఎం3-ఎం6 ప్రయోగ విజయం అనంతరం ఆయన శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేఖరులతో మాట్లాడారు. ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్2 వాణిజ్య ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టామని తెలిపారు. ఇస్రో బాహుబలిగా పేరొందిన ఎల్‌వీఎం3 రాకెట్లు ప్రస్తుతం కనబర్చిన పనితీరు అద్భుతంగా ఉందని చెప్పారు. చంద్రయాన్-4, 5తో పాటు వీనస్ మిషన్, మరెన్నో ప్రయోగాలు, గగన్‌యాన్, మానవరహిత ప్రయోగం, ఎయిర్ స్పేస్ స్టేషన్ ప్రయోగాలకు ఈ రాకెట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుతం జరిగిన ప్రయోగం అత్యంత కఠినమైనదని, భారత భూభాగం నుంచి అత్యంత బరువైన ఉపగ్రహాన్ని రోదశిలోకి పంపడం ఇదే ప్రథమమని చెప్పారు. నవంబర్ 2వ తేదీన ప్రయోగం జరిగిన తర్వాత 52 రోజుల్లో తిరిగి భారీ ప్రయోగం చేపట్టి అది విజయవంతం చేయడం ఇస్రో శాస్త్రవేత్తల కృషికి నిదర్శనమన్నారు. ఈ రాకెట్‌లో ఎస్2 సాలిడ్ మోటార్‌ను అభివృద్ధి చేసి పేలోడ్‌ను 150 కేజీలకు పెంచామని నారాయణన్ తెలిపారు. ఈ సమావేశంలో షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్, ఎస్ఎసి డైరెక్టర్ ఎం.నీలేష్‌దేశాయ్, యుఆర్ఎస్‌సి డైరెక్టర్ ఎం.శంకరన్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ ఎ.రాజరాజన్, ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ మోహన్, మిషన్ డైరెక్టర్ విక్టర్ జోసఫ్, ఎంఎస్‌ఎ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ, శాస్త్రవేత్తలు సౌమ్యా నారాయణన్, ఎకె అనిల్‌కుమార్, జె.ఆశిర్, గణేశ్‌పాటిల్‌లో పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి దర్శనంలో
# సామాన్య భక్తులకు పెద్దపీట
### టీటీడీతో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు
### కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు



తిరుపతి,డిసెంబర్ 24 ప్రభాతవార్త:

తిరుమల ఆలయంలో వైకుంఠఏకాదశి దర్శనం కల్పించడంలో సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. వైకు:ఠద్వార దర్శనాలకు చేపట్టిన భద్రతా ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి బుధవారం ఉదయం ఎస్పీ కార్యాలయంలో మీడియాప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేదీ వరకు పది రోజుల పాటు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులందరికీ వైకుంఠ ద్వార దర్శనం సక్రమంగా కల్పించేందుకు టీటీడీతో పాటు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిందని చెప్పారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై రెండు రోజుల క్రితమే జిల్లా ఇన్‌చార్జి మంత్రి ,రెవెన్యూ శాఖ మంత్రి, దేవాదాయ శాఖ మంత్రి, హోంశాఖ మంత్రి కలిసి తిరుపతిలో టీటీడీ అధికారులతో పాటు జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించారని తెలిపారు. అంతకుముందే టీటీడీ మరియు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పలు సమీక్షలు నిర్వహించాయని పేర్కొన్నారు. పది రోజుల పాటు జరగనున్న వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాల్లో భాగంగా మొదటి మూడు రోజులు ఏకాదశి, ద్వాదశి జనవరి 1న భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. టీటీడీ సామాన్య భక్తులకే ప్రాధాన్యం ఇస్తూ దర్శన సమయాన్ని ఎక్కువగా కేటాయించిందన్నారు. స్థానిక భక్తులకు కూడా దర్శన సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. తిరుపతి పట్టణంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, శానిటేషన్ ఏర్పాట్లు కూడా పటిష్టంగా చేపట్టామని చెప్పారు. ద్విచక్రవాహనాల్, కార్లు.,జీపులు వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వైకుంఠ ద్వార దర్శన టికెట్లు కలిగిన భక్తులు సులభంగా తిరుమల చేరుకునేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా పది రోజుల పాటు సుమారు మూడువేలమంది పోలీసు సిబ్బందిని నియమించామని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేదీ వరకు జరగనున్న వైకుంఠ ఏకాదశి ద్వార దర్శన ఏర్పాట్లలో భాగంగా తిరుమలతిరుపతి ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు , భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. టీటీడీ ప్రవేశపెట్టిన ఈ లింక్ ద్వారా టికెట్లు పొందిన భక్తులకు రోజుకు 60,000 మందిని దర్శనానికి అనుమతిస్తున్నట్లు చెప్పారు. టికెట్లు పొందిన భక్తులు తమకు కేటాయించిన తేదీ మరియు సమయంలోనే దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ విజిలెన్స్ సిబ్బంది సమన్వయంతో చర్యలు చేపట్టామని తెలిపారు. తిరుపతిలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, అలిపిరి, శ్రీవారి మెట్లు, స్థానిక దేవాలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా డ్రోన్లు, సీసీ కెమెరాల సహాయంతో నిరంతర నిఘా కొనసాగుతుందని చెప్పారు. భక్తులు తమకు కేటాయించిన సమయానికే రావాలని, అలా చేస్తే రద్దీ తగ్గి ప్రశాంత వాతావరణంలో దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులు, డిఎస్పీలు వెంకటనారాయణ, భక్తవత్సలం, రామకృష్ణమాచారి,రమణారావు(డిసిఆర్‌బి), చంద్రశేఖర్, సిఐలు మద్దయ్యాచారి, విక్రమ్,ఆర్ఐ హరికృష్ణలు పాల్గొన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై మీడియాకు కూడా అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధారణ చేయాలని సూచించారు.

## ఎల్‌వీఎం3-ఎం6 ప్రయోగం
# సూపర్ సక్సెస్
### కక్ష్యలోకి బ్లూబర్డ్ బ్లాక్2 - సత్తాచాటిన ఇస్రో శాస్త్రవేత్తలు



సూళ్లూరుపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త

ఇస్రో అంతరిక్ష ప్రయోగాల్లో మరో భారీ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించి సత్తా చాటింది. ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన వాణిజ్య ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్-2ను నిర్దేశించిన కక్ష్యలోకి ప్రవేశపెట్టి మరోసారి గగనతలంలో కీర్తిపతాకం ఎగురవేసింది. బుధవారం శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక నుంచి 8.55.30 నిమిషాలకు నిప్పులు చెరుగుకుంటూ ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ నింగికి ఎగిసింది. షార్‌లోని శాస్త్రవేత్తలు, సందర్శకుల కరతాళ ధ్వనుల మధ్య రాకెట్ గమ్యస్థానం వైపు దూసుకెళ్లింది. నింగిలోకి ఎగిసిన అనంతరం 500 కిలోమీటర్ల దూరాన్ని 15 నిమిషాల 30 సెకన్లలో చేరుకుని అత్యంత బరువైన 610 టన్నుల ఉపగ్రహాన్ని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది.

### రాకెట్ గమనం ఇలా..

రాకెట్ ప్రయోగాల్లో గతంలో నాలుగు దశలు ఉండగా, ప్రస్తుత ప్రయోగం మూడు దశల్లో ముగిసింది. మొదటి దశలో స్ట్రాపాన్ బూస్టర్లలో ఉన్న 400 టన్నుల ఘన ఇంధనం మండుకుని 105.98 సెకన్ల పాటు రాకెట్‌ను నింగిలోకి తీసుకెళ్లింది. అక్కడి నుంచి రెండో దశ ప్రారంభమైంది. 110 టన్నుల ద్రవ ఇంధనంతో రాకెట్ 301.70 సెకన్లపాటు మండుతూ రాకెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లింది. మూడో దశలో కీలకమైన క్రయోజనిక్ దశ ప్రారంభమై 304.36 సెకన్ల పాటు రోదశిలోకి బ్లూబర్డ్ బ్లాక్2 ఉపగ్రహాన్ని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఎఎస్‌పి స్పేస్ మొబైల్ సంస్థతో ఇండియాకు చెందిన ఎన్ఎస్ఐఎల్ చేసుకున్న వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఈ ప్రయోగం జరిగింది. రోదశి రంగంలో ప్రపంచ దేశాల్లో ప్రప్రథమంగా భారీ ఉపగ్రహ ప్రయోగం నిర్వహించి ఇస్రో మరో మైలురాయిని అధిగమించింది.

### భళారే బాహుబలి

ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరొందిన ఎల్‌వీఎం3-ఎం6 అత్యంత బరువైన బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపి బాహుబలి పేరును సార్థకం చేసుకుంది. ఎల్‌వీఎం సిరీస్‌లో ఇప్పటికి 8 ప్రయోగాలు సక్సెస్ కాగా, 9వ ప్రయోగం అమెరికాకు చెందిన బ్లూబర్డ్ భారత ఉపగ్రహం కావడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. ఈ ఉత్కంఠకు తెరదించుతూ ఆశించిన దాని కన్నా ఈ ప్రయోగం విజయవంతమైంది. ఇస్రో శాస్త్రవేత్తల కృషికి మంచి ఫలితం అందినట్లయింది. ఇస్రోకు ఇది 104వ ప్రయోగం. ఈ ప్రయోగ విజయంతో వాణిజ్య ప్రయోగాలకు ఇస్రో రాచబాట వేసినట్లయింది. ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా ఇప్పటివరకు మూడు వాణిజ్య ప్రయోగాలు జరిగి ఉన్నాయి. ప్రస్తుతం నాలుగవ ప్రయోగం కూడా విజయవంతం కావడంతో భవిష్యత్‌లో మరెన్నో ప్రయోగాలు ఇస్రో వాణిజ్యపరంగా చేసేందుకు ఈ ప్రయోగం దోహదపడుతుంది.

# క్రిస్మస్ వేడుకలకు విద్యుత్ వెలుగుల్లో చర్చిలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త

పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పండగలకు నిలయం. కుల మతాలు,వర్గ భేదాలు విస్మరించి ఏమతానికి సంబంధించిన పండగ వచ్చినా అందరూ కలసి మెలసి జరుపుకోవటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో నేడు క్రిస్మస్ పండగ. బుధవారం రాత్రి నుంచే పట్టణంలోని క్రైస్తవ సోదరుల ఇళ్ళ వద్ద సందడి చోటు చేసుకుంది. వారం రోజులుగా వివిధ చర్చిల్లో ప్రార్ధనలు, ఉపవాసదీక్షలు సాగుతున్నాయి. ప్రతి రోజూ పట్టణంలో ప్రదర్శనలు జరుపుతున్నారు. క్రీస్తు జననంకు సంబంధించి పాటల్ని ఆలపిస్తూ భక్తిభావాన్ని కల్పిస్తున్నారు. క్రైస్తవులు కాపారాలుంటున్న ఇళ్ళకు నక్షత్రాల వెలుగుల్ని నింపారు. ఇక ప్రార్ధనాలయాల్ని ఎంతో చక్కగా దేదీప్యమానంగా ముస్తాబు చేశారు.పండగ వాతావరణం చోటు చేసుకుంది. అప్పుడే శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. రాత్రికే చర్చిల్లో భక్తులు నిండారు. క్రీస్తు జననానికి సంబంధించి పఠిస్తున్నారు.

### -నేడు క్రిస్మస్

వేడుకలకు ముస్తాబైన ప్రార్ధనాలయాలు:

క్రిస్మస్ వేడుకలకు శ్రీకాళహస్తి పట్టణంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. ప్రాచీన చరిత్ర, మతసామరస్యాన్ని కలిగి ఉన్న లూథరన్‌చర్చి, పునీతశౌరివారి చర్చి(కాథలిక్‌చర్చి), ఇసిఐ, పెంతెకోస్తు, ఎల్ఇఎఫ్, బెతస్తప్రార్ధనామందిరాలు, జెరూసలెంచర్చి, భక్తసింగ్‌చర్చి, పానగల్‌లోని చర్చి, ఎన్‌టిఆర్‌నగర్,చెంచులక్ష్మి కాలనీ, ఎంజిఎం పక్కన చర్చి, తెట్టు వద్ద ఉన్న ప్రార్ధనామందిరాలను విద్యుత్ దీపకాంతులతో దేదీప్యమానంగా అలంకరించారు. ఎటు చూసినా క్రిస్మస్ సంబరాలు, కొనుగోళ్ళుతో పట్టణం కళ కళ లాడింది. ఈపండుగకు క్రైస్తవసోదరులు ప్రత్యేకంగా కేక్‌లను తయారుచేశారు. పునీతశౌరివారి చర్చి వద్ద ఏసుక్రీస్తు జననాన్ని



సవివరంగా తెలియజేసే రూపాలను మట్టిబొమ్మలతో ఆకర్షణీయంగా మలచడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

## భారతీయ విజ్ఞాన సమ్మేళనకు
# హాజరుకానున్న సీఎం చంద్రబాబు

తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 24 ప్రభాతవార్త :

ఈ నెల 26 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారతీయ విజ్ఞాన సమ్మేళన కార్యక్రమానికి హాజరుకానున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.బుదవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు సిఎం పర్యటన ఏర్పాట్లపై ఏ ఎస్ ఎల్ లో( ముందస్తు భద్రత లైజన్) భాగంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, డి ఆర్ ఓ నరసింహులు, అడిషనల్ ఎస్పీలు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఈ నెల 26 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారతీయ విజ్ఞాన సమ్మేళన కార్యక్రమానికి రానున్నారని, ముందుగా ఉదయం 9.50 గంటలకు ఎస్వి అగ్రికల్చర్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ కు చేరుకుని అనంతరం రోడ్డు మార్గాన 10.20 గంటలకు జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయంలో జరిగి భారతీయ విజ్ఞాన సమ్మేళన కార్యక్రమానికి హాజరవుతారని, ఆ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 12.35 గంటలకు (డిపిఓ) డిస్టిక్ పోలీస్ ఆఫీసుకు చేరుకొని ప్రారంభోత్సవ చేస్తారని తెలిపారు.. వైద్య ఆరోగ్య శాఖ వారు స్పెషలిస్ట్ డాక్టర్లు ఏర్పాటు, సేఫ్ రూమ్ ఏర్పాటు, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, ఫైర్ సేఫ్టీ, హెలిపాడ్ వద్ద బారికేడ్లు ఏర్పాటు, నిరంతర్నాయగా విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటించు ప్రదేశాలలో ఎక్కడ కూడా గుంతలు ఉండే రోడ్లు ఉండరాదని వాటి ఏర్పాట్లు చూడాలని తెలిపారు.



సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ మోర్య

ఏర్పాట్లపై విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా సీరియస్ గా విధులు నిర్వహించాలని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున బందోబస్తు పక్కాగా ఉండాలని, ఎలాంటి నిరక్ష ్యం వహించరాదని తెలిపారు. హెలిప్యాడ్ వద్ద పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. హెలిప్యాడ్ నుంచి మెయిన్ వేదిక కార్యక్రమం వరకు రూట్ మ్యాప్లను, ట్రాఫిక్ మేనేజ్మెంట్ వంటి పనులను జాగ్రత్తగా చూసుకోవాలని పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను ఎస్పీ సుబ్బరాయుడు, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ మోర్య, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి లు, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, డి.పి. ఓ సుశీల దేవి, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో రెండు పంచాయతీల
# విభజనకు ప్రతిపాదనలు
### - జనాభా.. విస్తీర్ణం..గ్రామాల సంఖ్య అధికమే కారణం !!

కుప్పం, డిసెంబర్ 24 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలోనే కుప్పం గ్రామీణమండలం ఇప్పటికే అత్యధికంగా 29 గ్రామ పంచాయతీలను కలిగి ఉంది. తాజాగా గ్రామీణ మండలంలో ఇదివరకే ఉన్న రెండు గ్రామ పంచాయతీలను విభజించాలని కోరుతూ ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు అందజేశారు. ఈ రెండు పంచాయతీలు ఓ పక్క జనాభా, మరో పక్క విస్తీర్ణంతో పాటు గ్రామాల సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో పంచాయతీలను విభజించాలని ప్రతిపాదనలు రూపొందించి తీర్మానం చేశారు. మండలంలో తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న కొటాలూరు, మంకలదొడ్డి పంచాయతీలను విభజించాలని ప్రతిపాదించారు. కొటాలూరు పంచాయతీలో జనాభా 4104మంది ఉన్నట్లు గుర్తించారు. ఈ పంచాయతీ తమిళనాడు సరిహద్దులో ఉండడంతో పాటు గ్రామాలు అటవీ ప్రాంతంలో సైతం ఉండడంతో పాటు విస్తీర్ణంలో పెద్దదిగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ పంచాయతీని రెండుగా విభజించి పంచాయతీలోని గుండ్లమడుగు పంచాయతీ కేంద్రంగా కొత్త పంచాయతీ ఏర్పాటుకు ప్రతిపాదించారు. అలాగే మంకలదొడ్డి పంచాయతీలో 4474 మంది జనాభా ఉన్నారు. ఈ పంచాయతీలో 12 గ్రామాలు ఉన్నాయి. ఈ పంచాయతీ కూడా విస్తీర్ణంలో పెద్దదిగా ఉన్నది. పంచాయతీలోనిగ్రామాలకువిభజించి పెద్దగోపనపల్లి గ్రామంను కొత్త పంచాయతీ కేంద్రంగా చేస్తూ ఆ పంచాయతీలో కొన్నిగ్రామాలను విభజించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు.

# శివయ్య సేవలో పివి సింధూ

శ్రీకాళహస్తి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం భారత్‌బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధూ కుటుంబసభ్యులతో కలసి వాయులింగేశ్వరుని సేవలో పూజలు జరిపించుకున్నారు. ఆమె రాగా దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో ఆలయ ఛైర్మెన్ కొట్టె సాయి ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ, ఎపిఆర్‌ఓలు వేదపండితులతో స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా పర్యటనకు సింధూ వచ్చిన ప్రతిసారి శ్రీకాళహస్తీశ్వరాలయంలో దేవేరి జ్ఞాన ప్రసూనాంబదేవి, వాయులింగేశ్వరుని దర్శించుకోవటం ఆనవాయితి. బుధవారం వారికి స్వామి అమ్మవార్ల అ ంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను వేదపండితులు అందించగా ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టెసాయి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.ఏర్పాట్లను ప్రోటోకాల్ ఎఇఓ మోహన్,బోర్డు సభ్యులు కుసుమ కుమారి, పర్యవేక్షకులు నాగభూషణయం యాదవ్,ఎపిఆర్ఓ రవిలు పర్యవేక్షించారు. కాగా అతిథి గృహంలో ఛైర్మెన్ సింధూను ప్రత్యేకంగా అభినందిస్తూ దుశ్శాలువతో సత్కరించారు.

# మెడికల్ కళాశాల భూ సంరక్షణపై "ప్రిన్సిపాల్ హ్యాండ్సప్"
### బస్టాండ్‌కు కిలోమీటర్ దూరంలో భూ కేటాయింపుకు అంగీకారం
### భూ సంరక్షణ ఇక మెడికల్ విద్యార్ధుల భాధ్యత

చంద్రగిరి, డిసెంబర్ 24 ప్రభాతవార్త:

శ్రీవెంకటేశ్వర మెడికల్ కళాశాల అనుబంధ రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ (చంద్రగిరిలోని ఆసుపత్రి)కు చెందిన భూ సంరక్షణపై ప్రిన్సిపాల్ పూర్తిగా చేతులెత్తేశారనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సొంత మండల కేంద్రంలోని గ్రామీణ ఆరోగ్య శిక్షణా కేంద్రం (ఆసుపత్రి) ఉనికికే ప్రమాదం కలిగిస్తున్న భూ బదలాయింపుపై దూకుడు చర్యలు ఎవరిమెప్పు కోసమనే విమర్శలు వస్తు న్నాయి. చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద గల పాత ఆసుపత్రి భూమిని ఎస్సీ హాస్టల్‌కు కేటాయించడం, భవన సముదాయాలను యుద్ధప్రాతిపధికన కూల్చివేయ డం వంటి చర్యలు వైద్య ఆరోగ్య విభాగాలతో పాటు స్థానికుల నుండి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ విషయంలో ఎంఎల్ఏ పులివర్తి నాని వేగంగా స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టని పక్షంలో రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ చంద్రగిరి నుండి కనుమరుగవడం ఖాయంగా కనిపిస్తున్నది.

అయితే భూ బదలాయింపుపై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా "కలెక్టర్ ఈ విషయంలో చాలా సీరియస్‌గా వున్నారు. మాకు మరో ప్రదేశంలో భూమి కేటాయించారని" తేలిగ్గా చెప్పడం ఆశ్చర్యం కలిగిం చింది. మెడికల్ కళాశాలకు సంబంధించిన భూమికి కేవలం సంరక్షకులుగా వుండాల్సిన ప్రిన్సిపాల్ తనను జిల్లా కలెక్టర్ కోరిన సమయంలో ఎదురు చెప్పలేని నిస్సహాయ స్థితి వున్నట్లయితే హెల్త్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్ళాల్సి వుంది. ఇటువంటి ఆలోచన చేయడంలో ప్రిన్సిపాల్ విఫలమయ్యారు. ఇంతటి ఖరీదైన, అనువైన భూమి భవిష్యత్‌లో లభించే పరిస్థితి లేనప్పుడు మరెక్కడో కిలోమీటర్ దూరంలో గుట్టపొరంబోకు భూమిని కేటాయిస్తే అంగీరించడం దేనికి సంకేతం. ఇంతటి ఖరీదైన భూమిలో భవనం నిర్మించుకోలేని మెడికల్ కళాశాల యాజమాన్యం గుట్టను చదును చేసి నిర్మించడం సాధ్యమా. భూ బద లాయింపుపై పత్రికలో కథనాలు వచ్చినప్పటికీ ప్రిన్సిపాల్ కనీసం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం ఆయనలోని బాధ్యతారాహిత్యాన్ని వెళ్ళడిస్తున్నది. వాస్తవానికి బస్టాండ్ వద్ద హాస్టల్ నిర్మిస్తే రణగొణ ధ్వనుల మధ్య విద్యార్ధుల విద్యా భ్యాసానికి తీవ్ర అసౌకర్యంగా వుంటుంది. పైగా టవర్ క్లాక్ వద్ద తరచూ పార్టీలు, సంఘాలు ఏవైనా ఆందోళన కార్యక్రమాలు చేపడితే తప్పక హాస్టల్ విద్యార్ధులను తీసుకు వచ్చి కూర్చోబెట్టడం జరుగుతుంది.ఆసుపత్రి వుండవలసిన స్థలాన్ని హాస్టల్‌కు కేటాయించి, హాస్టల్ వుండవలసిన స్థలాన్ని ఆసుపత్రికి కేటాయించడం అనాలోచిత నిర్ణయంగా ప్రజలు భావిస్తున్నారు.



## కుప్పంలో పంటలసాగు విస్తీర్ణాన్ని పెంచాలి : కడ పి.డి.



**కుప్పం,డిసెంబర్ 24 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో రైతులు చేపట్టే పంటలసాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. బుధవారం కడ కార్యాలయంలో ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, కడ సభ్యులతో కలసి పి.డి. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఎంపిడిఓలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో పది లక్షల లీటర్ల పాల ఉత్పత్తి రోజూ వచ్చేలా పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలుచేపట్టాలన్నారు. ఉచిత లింగనిర్ధారిత వీర్యం ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. కుప్పంకు సిఎం చంద్రబాబునాయుడు హంద్రీ–నీవా జలాలు తెచ్చారని తద్వారా ఈ ప్రాంతంలో మరింతగా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగేలా చూడాలన్నారు. ఉద్యానవన పంటలసాగు అధికంగా చేపట్టాలన్నారు. అలాగే రైతులకు ఆయా శాఖల్లో ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు వివరించి రైతులకు మరింత లబ్ధి కలిగేలా చూడాలని ఆదేశించారు.కుప్పానికి వస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు స్థానికంగానే సప్లై చేయాలన్నారు.కార్యక్రమంలో మండలటిడిపి అధ్యక్షుడు రాజగోపాల్, కడ సభ్యులు సుగుణమ్మ,సతీష్, ఎడిలు పల్లవి, రవిశంకర్, అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సిఎం చంద్రబాబు చర్యలు



**కుప్పం, డిసెంబర్ 24 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మొట్లచేను పంచాయతీ ఇందిరానగర్ కాలనీలో పది లక్షలతో నూతనంగా సిమెంట్ రోడ్డు నిర్మాణంకుఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడ్తామన్నారు.కార్యక్రమాల్లో మాజీ ఎంపిపి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర,యువ నేత సికె విజయ్‌కుమార్ ,నేతలు విభూషణ్,మోహన్, మనోహర్, తిరుపతి, చంద్ర,ప్రకాష్, బాబు,రాజా, అశోక్ పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారంకు వినతి



**రామకుప్పం, డిసెంబర్ 24 ప్రభాతవార్త** మండలంలోని విజలాపురం పరిధిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి స్థానిక నేతలతో కలసి తహశీల్దార్ కౌలేష్‌కు వినతిపత్రం అందించారు. గతప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను ఆన్‌లైన్‌లో పరిచేయాలన్నారు. భూమి కమతాలు, పేర్లు మారిన వివరాలను పరిశీలించి పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకటరామగౌడు, మాజీ సర్పంచులు శ్రీనివాసులురెడ్డి, రామూర్తి,జయశ ంకర్, రామకృష్ణప్ప, అల్లిశీన పాల్గొన్నారు

## రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**గుడుపల్లె, డిసెంబర్ 24 ప్రభాతవార్త** చెన్నై – బెంగళూరురైలు మార్గంలో గుడుపల్లె రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ చివరన ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు గుర్తించామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. మృతుడికి సుమారు 50–55 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. మృతదేహాన్నిగుర్తించిన వారు 8074088806నెంబరుకు సమాచారం అందించి కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

## పిహెచ్‌సిల్లో కడ పి.డి.ఆకస్మిక తనిఖీలు

**శాంతిపురం, డిసెంబర్ 24 ప్రభాతవార్త** మండలం లోని శాంతిపురం, రాళ్లబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్‌వికాస్ మర్మత్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, టాటాడిజిటల్ నెర్వ్ సెంటర్ సేవలను అడిగి తెలుసుకున్నారు. శాంతిపురం పిహెచ్‌సిలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అవసరమైన నిధులు కడ ద్వారా మంజూరు చేస్తామని పి.డి. పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పిహెచ్‌సిలకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ డిఎంహెచ్ఓ గంగాదేవి, నేతలు నాగరాజు, జనార్ధనరెడ్డి, మంజునాథ్,బాలాజీ, శివ, గణేష్, శ్రీనివాసులు, నాగభూషణ ం,మణి, కుమార్, జయరాజ్ పాల్గొన్నారు.



## తూకివాకం చెరువు మత్స్యశాఖఆధీనం..

**రేణిగుంట డిసెంబర్ 24 ప్రభాతవార్త.** తూకివాకం చెరువు పూర్తిగా మత్స్యశాఖ ఆధీనంలో ఉందని తూకివాకం మాజీ ఎంపీటీసీ నాగ సుబ్రహ్మణ్యం తెలిపారు. తూకివాకం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెరువు లీజు కాలం పూర్తయిన చెరువు పై అధిపత్యం చలాయిస్తున్నాడని మాజీ ఎంపీటీసీ నాగసుబ్రమణ్యం రెడ్డి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ కు, అదేవిధంగా ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కి అర్జీలు సమర్పించానన్నారు. అర్జీలపై జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే మత్స్యశాఖ అభివృద్ధి అధికారికి సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారన్నారు. స్పందించిన తిరుపతి మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వెంకటరమణ సదరు చెరువుపై ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు అన్నారు. చెరువులో పంచాయితీ లేదా ప్రైవేటు వ్యక్తులు చేప పిల్లలు వేయడం,చేపలు పట్టడం లాంటివి చేయకూడదని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి తెలిపారు అన్నారు.....

## లే అవుట్ ప్లాట్‌లు, ప్లాన్ అతిక్రమించి నిర్మించిన కట్టడాలు క్రమబద్ధీకరించుటకు చక్కటి అవకాశం



***వరదయ్యపాలెం, డిసెంబర్ 24, ప్రభాతవార్త*** తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో ప్రభుత్వం జీవో ఎంఎస్ 134, ఎంఎ అండ్ యుడి డిపార్ట్మెంట్ తేదీ 26.07.2025 ద్వారా 30.06. 2025 తేదికి ముందు రిజిస్టర్ కాబడిన అనధికార లేఔట్ ప్లాట్‌లను తమ క్రమబద్ధీకరించుటకై అవకాశం కల్పించారని డివిఎంసి సభ్యులు గుత్తి త్యాగరాజు, మండల ఏఓ ప్రసాద్, జిఎస్‌డబ్ల్యూ డిప్యూటీ ఎంపిడిఓ బసిరెడ్డిలు విజ్ఞప్తి చేసారు. వారు మాట్లాడుతూ ఏడు శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు మాత్రమే ఉంటాయి (14 శాతం ఓపెన్ ఫేస్ చార్జీలపై 50 శాతం రాయితీ ఇవ్వడం వలన 7 ఓపెన్ స్పేస్ చార్జీలు మాత్రమే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సిబ్బంది లక్ష్మయ్య, సురేష్‌లు పాల్గొన్నారు.

## స్విమ్స్ డైరెక్టర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు



**తిరుపతి హెల్త్, డిసెంబర్ 24, ప్రభాతవార్త** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బుధవారం సాయంత్రం స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ తెలియజేశారు. ఈ స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ విద్యార్థులనుద్దేశించి, మాట్లాడుతూ 1984 డిసెంబర్ 2వ తేదిని భారతదేశంలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవంగా పాటిస్తారని, భోపాల్ గ్యాస్ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల జ్ఞాపకార్థం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా నాగరాజ్ మాట్లాడుతూ పచ్చని భవిష్యత్తు కోసం స్థిరమైన జీవనం అనే అంశం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఎం.బి.బి.ఎస్. మూడవ సంవత్సరం విద్యార్థిని పి. ఉషశ్రీ, పిజియోథెరఫీ కళాశాల బిపిటి మూడవ సంత్సరం విద్యార్థిని సి.జీవనశ్రీ, అలైడ్ హెల్త్ సైన్స్ స్ కళాశాల విద్యార్థిని ఎన్‌పిటి 2వ సంవత్సరం విద్యార్థినీ పి.సన ముష్కిన్లు నిలిచారు. మొత్తం 9 మంది విద్యార్థులకు డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజే శారు.కమ్యూనిటీ మెడిసిన్ నోడల్ ఫ్యాకల్టీ మరియు అసోసియేట్ ప్రొఫెసర్ డా. చంద్రశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. విశ్వేశ్వరరావు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సంరక్షణపై పాలిటెక్నిక్ విద్యార్థుల అవగాహన ర్యాలీ

చంద్రగిరి, డిశంబర్ 24 ప్రభాతవార్త:



నీటి సంరక్షణపై 2 ఆంధ్ర ఇంజినీర్ కంపెనీ, చంద్రగిరి ప్రభుత్వ, తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలల ఎన్ సి సి విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం బుచ్చి నాయుడు పల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. లెఫ్టినెంట్ కల్నల్ కడియాల శ్రీనివాసులు ఆదేశాల మేరకు.. జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామం లో వ్యర్థాలను తొలగించి, పరిసరాలను పరి శుభ్రం చేశారు. అన ంతరం గ్రామస్థులకు 20 లీటర్లు వాటర్ క్యాన్‌లను పంపిణీ చేశారు. ఈ జెసిఓ మణికందన్, ఎన్‌సిసి స్టాఫ్ శ్రీదర్, యశ్విని, రామానాయుడు, సర్పంచ్ రవి, పాల్గొన్నారు.

## క్రిస్మస్ పండగ ఆనందంగా జరుపుకోండి

**తొట్టంబేడు డిసెంబర్ 24 ప్రభాతవార్త** తొట్టంబేడు మండలంలోని ప్రజలంతా క్రిస్మస్ పండుగను సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అందరూ కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావిల్ల మునిరాజనాయుడు అన్నారు. క్రైస్తవ సోదరులు చేసుకునే పండగల్లో ప్రధానమైనది క్రిస్మస్.అత్యంత ప్రీతి పాత్రమైనదని ఏసుప్రభు జన్మించిన రోజున యావత్ ప్రపంచమంతా పండగ జరుపుకుంటుందన్నార్లు.క్రైస్తవ సోదరులంతా మిక్కిలి పండుగ జరుపుకోవాలని ఆయన కోరారు.

## ఎంపిచే 'అవర్స్‌యూనిటీ' యాప్ లోగో ఆవిష్కరణ



**చిత్తూరురూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** ఆధునిక ప్రజల అవసరాలను తీర్చే సరికొత్త 'అవర్స్ యూనిటీ' యాప్‌ను బుధవారం చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమల్ల ప్రసాదరావు ఆవిష్కరించారు. యాప్ రూపకర్త సుబ్రమణ్యం కొత్తగా రూపొందించిన ఈ యాప్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సేవలందించనుందనీ, స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని వినియోగదారులకు కావలసిన ఆహారపదార్థాలు, ఫ్యాషన్ డెలివరీ, గృహాలకు సంబంధించిన ప్లంబర్, ఎలక్ట్రిషియన్, సురక్షితమైన రవాణాకు సంబంధించిన అన్ని సేవలను సులభంగా వేగంగా పొందవచ్చునని ఎంపికి వివరించారు.

## పలమనేరులో మినీ క్రిస్‌మస్ వేడుకలు



**పలమనేరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త:** పలమనేరులో మినీ క్రిస్‌మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద క్రిష్టియన్ పిల్లలు ఏసుక్రీస్తు భక్తి గీతాలు, భజనలు ఆలపించారు. ఎమ్మెల్యే అమరనాధరెడ్డి కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా క్రిస్‌మస్ పండుగ ముందు రోజు అంటే డిసెంబర్ 24న మినీ క్రిస్‌మస్ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఏసుక్రీస్తు ప్రజలను చల్లగా చూడాలని, ప్రభువు దీవెనలతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమీషనర్ కెవి రమణారెడ్డి,సిఎస్‌ఐచర్చి ఫాస్టర్, పలువురు కౌన్సిలర్లు అధిక సంఖ్యలో క్రిష్టియన్ సోదరులు పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ

**పలమనేరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త:** పలమనేరులో వివిధ కళాశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సేకరించిన హెల్మెట్లను ఎమ్మెల్యే విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్రవాహన దారులను ప్రమాదాల నుండి కాపాడేది హెల్మెట్లు మాత్రమే నన్నారు. జీవితం ఎంతో విలువైనదని జీవితాన్ని కాపాడుకోవడం మనిషి బాధ్యత అని వివరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపడం, పోలీసులు కేసులు నమోదు చేస్తూ జరిమానాలు విధించడం సర్వ సాధారణమని ఐతే ఇవేవీ పోయిన ప్రాణాలు తిరిగి తీసుకు రాలేవన్నారు. డిస్పీ గేడల ప్రభాకర్, సిఐ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పులిచర్ల మండలంలో వైఎస్ఆర్సిపిలో వర్గపోరు

**– కార్యకర్తల్లో అసంతృప్తి – పార్టీకి నష్టం తప్పదన్న ఆందోళన**

**కల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త** పుంగనూరు నియోజకవర్గం, పులిచర్ల మండలంలో వైఎస్ఆర్సిపిలో వర్గ రాజకీయాలు (గ్రూపు రాజకీయాలు) తీవ్రస్థాయికి చేరుకున్నాయి. గత ఎన్నికల ముందు కూడా ఇదే మండలంలో అంతర్గత విభేదాల కారణంగా పార్టీకి గణనీయమైన నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ పరిస్థితుల్లో పెద్దగా మార్పు కనిపించకపోవడం పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. మండలంలో పైకి అందరూ ఐక్యంగా ఉన్నట్లు కనిపించినా, అంతర్గతంగా ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉందని కార్యకర్తలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. వర్గాల మధ్య సమన్వయం లోపించడం వల్ల పార్టీ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలుకావడం లేదని సమాచారం. ఈ పరిస్థితి ముఖ్యంగా క్షేత్రస్థాయి కార్యకర్తలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. వర్గపోరును సరిదిద్దేందుకు పార్టీ సీనియర్ నాయకులు ప్రయత్నాలు చేసినప్పటికీ, అవి పూర్తిస్థాయిలో ఫలించలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమావేశాలు, చర్చలు జరిగినప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో మాత్రం విభేదాలు తగ్గడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు.మండలంలో కొనసాగుతున్న ఈ అంతర్గత కలహాలు ఇలాగే కొనసాగితే, రానున్న రోజుల్లో పార్టీకి మరింత నష్టం తప్పదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పార్టీ అధిష్టానం మరియు స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెంటనే జోక్యం చేసుకుని వర్గపోరుకు ముగింపు పలకాలని, లేకపోతే కేడర్‌లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు సూచిస్తున్నారు.

## అంగన్‌వాడి కేంద్రాలకు సామ్‌సంగ్ ఏ06 5జి మొబైల్స్ పంపిణీ



**కల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త** పులిచర్ల ప్రాజెక్టు పరిధిలోని పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం మండలాలలో 148 అంగన్‌వాడి కేంద్రాలకు సిడిపిఓ వాణిశ్రీ దేవి, లెక్కల ధనుంజయనాయుడు సింగల్ విండో ప్రెసిడెంట్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా సామ్‌సంగ్ ఏ06 5 జి మొబైల్స్ పంపిణీ చేసారు. అంగన్‌వాడి కార్యకర్తలు బెనిఫిషరీలను రిజిస్ట్రేషన్‌లు చేయడానికి,టిహెచ్‌ఆర్ డిస్ట్రిబ్యూషన్‌కి చేయడానికి, ప్రీ స్కూల్ అటెండెన్సీని గ్రోత్ మానిటరింగ్, ఎత్తులు బిడ్డవి ఆన్‌లైన్ చేయడానికి వున్న యాప్స్ బాల సంజీవని యాప్, పోషణ – ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలని ముఖ్య కారణమన్నారు. ఇలా గర్భవతులు, బాలింతలు రిజిస్ట్రేషన్‌లు, డెలివరీలు అంగన్‌వాడి కార్యకర్తలు ఉపయోగిస్తారు.సూపర్వైజర్స్ విజయలక్ష్మి, శిరీష, మల్లీశ్వరి, ఆఫీస్ స్టాఫ్, రాధ, వెంకటేష్, బాలకృష్ణ, సింగల్ విండో ప్రెసిడెంట్ కుమార్ రెడ్డి, మహేష్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి ప్రజలకు చెప్పాలి

**– ప్రభుత్వ విప్‌డా॥ కంచర్ల శ్రీకాంత్ – స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి!!**



**కుప్పం, డిసెంబర్ 24 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గంలో సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకుచెప్పాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉ ందని ప్రభుత్వ విప్, కడ పిఏసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు. బుధవారం పాలారు వద్ద గల పిఎస్‌ఎం ఫామ్‌హౌస్‌లో కుప్పం మున్సిపల్ తెలుగుదేశం పార్టీకి సంబంధించిన పద్నాలుగు అనుబంధ విభాగాల కమిటీలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా డా॥ శ్రీకాంత్ మాట్లాడారు. ఏడాదిన్నర కాలంలోనే కుప్పానికి సిఎం చంద్రబాబు కృష్ణాజలాలు తెచ్చి ఈ ప్రాంతాన్ని సస్య శ్యామల ంచేస్తున్నారన్నారు. 2203కోట్లతో ఏడు పరిశ్రమలకు శంకుస్థాపన చేశారన్నారు. మరిని ్న పరిశ్రమలుసైతం కుప్పంకు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీలో సైతం తొలివిడత 22కోట్లతో స్టేడియం, 3కోట్లతో ఎల్‌పిజి స్మశాన వాటిక, 10కోట్లతో జమీందారు పార్కు అభివృద్ధికి చర్యలుచేపట్టారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్లాల్సిన బాధ్యత నేతలు, కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. ( కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఎపిఇడబ్ల్యు కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్,మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మండల టిడిపి అధ్యక్షుడు రాజగోపాల్, స్థానిక నేతలు పాల్గొన్నారు.అనంతరం ఇటీవల జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సునీల్‌కుమార్ చౌదరిని ఘనంగా సత్కరించారు.

## చెక్‌పోస్టుల్లో ఎఎంసి ఛైర్మన్ ఆకస్మిక తనిఖీలు



**కుప్పం, డిసెంబర్ 24 ప్రభాతవార్త** వ్యవసాయ మారె ్కటింగ్ శాఖకు సంబంధించిన చెక్‌పోస్టుల్లో కుప్పం ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయాక చెక్‌పోస్టు వద్దకు ఆయన చేరుకుని రికార్డులు పరిశీలించారు. మండలంలోని నడిమూరు వద్ద గల చెక్‌పోస్టులో పనిచేస్తున్న సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడే కొంతసేపు ఉ ండి సిబ్బంది పనితీరు, వాహనదారులతో మాట్లాడే విధానాన్ని పరిశీలించారు. చెక్‌పోస్టులను పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏదేని అనుమతులు లేకుండా వ్యవసాయ ఉత్పత్తులు రవాణా జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రదానం

**చిత్తూరుహెల్త్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** చిత్తూరు వరదప్పనాయుడు పాఠశాల విద్యార్థులకు జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన వ్యాస, వకృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శ్రీవెంకటేశ్వర అనాధ సేవా సదన్ నిర్వాహకులు లీలా ప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాల విద్యార్థులకు వినియోగదారుల దినోత్సవంపై వ్యాస, వకృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం లీలా ప్రసాద్ విద్యార్థులకు వినియోగదారుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసిఎన్ ట్రస్ట్‌చే క్రైస్తవులకు నిత్యావసరాలు అందజేత



***కుప్పం,డిసెంబర్ 24 ప్రభాతవార్త*** క్రైస్తవుల ముఖ్య పర్వదినంక్రిస్మస్‌సందర్భంగాబిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారానిరుపేద క్రైస్తవ కుటుంబాలకు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్‌డా॥బిసినాగరాజ్‌తమవంతుసహకారం అందించారు. సుమారు వంద మందికి బియ్యం,ఇతర నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పం డగ శుభాకాంక్షలు తెలిపారు. విశ్వశాంతిని కోరే ప్రతి పరోపకారి యేసు బోధనలుతమ జీవితంలో ఆచరిం చాలని సూచించారు. అనంతరం షాలోమ్ చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.కెఇసి సెక్రటరీ సాగ ర్ రాజ్, చర్చి ఫాదర్ సుబ్రమణ్యం, అధ్యాపకులు పార్ిబన్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, క్రైస్తవ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**రామకుప్పం, డిసెంబర్ 24 ప్రభాతవార్త** మండలంలోని రాజుపేటలో ఉన్న గ్రీన్‌వ్యాలీ పబ్లిక్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెర్మియా చర్చి ఫాదర్ వజ్రం అధ్వర్యంలో ప్రార్ధనలు చేపట్టారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు.ఫౌండర్‌నందినిమంజునాథ్,ప్రిన్సిపాల్‌జ్యోతీశ్వర్ గాంధీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అభివృద్ధికి సహకరిస్తాం: మాజీ మంత్రి పెద్దిరెడ్డి



**సదుం డిసెంబర్ 24 ప్రభాత వార్త** మండలంలో అభివృద్ధికి సహకరిస్తామని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన సదుం మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్లవారిపల్లె, చెరువు ముందర పల్లె మారుతివారిపల్లె, పాతపేట, జాంద్రపేట, సదుం, పాలమంద, ఊ టు పల్లి పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి గురైన పలువురుని పరామర్శించారు. అదేవిధంగా మృతిచెందిన పార్టీ నాయకులు కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో భాగంగా సదంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని, శ్రీ సదమమ్మ ఆలయాన్ని దర్శించారు. చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధి మరియు పునరుద్ధరణకు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ విషయమై ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ధనుంజయ రెడ్డి,మండల వైకాపా అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, సర్పంచులు జగన్నాథం, అనిత కుమారి, ఉషారాణి, శ్రీనివాసులు రెడ్డి, కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్, ఎంపీటీసీలు దేశీ రెడ్డి శ్రీలత, మల్లికార్జున, సోమల మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు శివానందరెడ్డి, మండల వైసీపీ నేతలు ప్రకాష్ రెడ్డి, గణేష్ రెడ్డి, వాసు, గిరిధర్ రెడ్డి, భాష ,రాజశేఖర్, రమేష్ రెడ్డి శ్రీరాములు, వెంకటరమణ, దాము, బాబురెడ్డి డాక్టర్ రమణారెడ్డి, ఎండపల్లి మనోహర్ రెడ్డి, మోహన్ రెడ్డి కమురుద్దీన్ మాజీ సర్పంచ్ ధన శేఖర్ రెడ్డి, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడ్డ నేతకే పట్టం కట్టారు...

**–గువ్వల ఎన్నికపట్ల సంబరాలు**



**చౌడేపల్లి, డిసెంబర్ 24 ప్రభాతవార్త** నమ్ముకొన్న పార్టీ కష్టకాలంలో ఉండగా ఎదురొడ్డి నిలబడ్డ నేత గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి)కే పట్టం కట్టారని సీనియర్ నాయకులన్నారు. తేదేపా మండలాధ్యక్షుడుగా 3వ సారి ఎన్నికయిన గువ్వల రామకృష్ణారెడ్డి తనయుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) ఎన్నికయ్యారు. ఇటీవల పార్టీ అధిష్టానం ఐవిఆర్‌ఎస్ ఎన్నికలు నిర్వహించింది. ఇద్దరు వ్యక్తుల్లో గువ్వల రమేష్‌రెడ్డికి మండలంలోని తేదేపా సభ్యత్వం కల్గిన కార్యకర్తలు ఐవిఆర్‌ఎస్ ఫోన్‌కాల్ ద్వారా తెలిపారు. రెండు రోజుల క్రితం అప్రూవల్ చేస్తూ మరో మెసేజ్ వచ్చింది. అందులోనూ గువ్వలను ప్రతిపాదించారు. దీంతో గువ్వల రమేష్‌రెడ్డి మండలపార్టీ అధ్యక్షుడుగా ఎన్నికయినట్లు సోషియల్ మీడియాలో హల్‌చల్ చేసింది. నాయకులు, కార్యకర్తలు స్థానిక బస్టాండుకు చేరుకొని సంబరాల్లో మునిగి తేలారు. పార్టీ ప్రముఖులు ఆయన్ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆవుల రామచంద్రయ్య, పూల చంద్రమౌళి, పంజానిపల్లి బాబు, జంపాల శ్రీనివాసులు, పవన్‌కుమార్, గిరినాయుడు, అనూష్‌రాయల్, ప్రభాకర్, చంగ్రాయుడు, కళ్యాణ్, కుమార్‌రెడ్డి, ఆమినిగుంట శంకర అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



**కాణిపాకం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు బుధవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన గెపిశెట్టి శ్రీహరి అనే భక్తుడు నిత్యాన్నదానంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్ాన్ని ఆలయ సూపరిండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవికి అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైను మర్యాదపూర్వకంగా కలసిన జనసేన నాయకులు



**తవణంపల్లె, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** తవణంపల్లె ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నాయక్‌ను మండలంలోని జనసేన నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు జనసేన నాయకులు కొత్తపల్లె శివప్రసాద్, మండల అధ్యక్షుడు రాజశేఖర్,ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వర్లు(చిన్న),ఉదయ్‌కుమార్, ఏస్, నాయకులు అజిత్ శ్రీరాములు, యువ రాజ్స్వెరో, పృధ్వి,అనిల్, సునీల్,కార్తీక్, కిరణకుమార్ ఎస్సైను కలసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యేచే మసీదు ఉరుసు గంధం పోస్టర్ల ఆవిష్కరణ



**చిత్తూరురూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:** చిత్తూరునగరంలోని మండివీధి మసీదు ఉరుసు గంధం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దుశ్శాలువతో సత్కరించి ఉత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలు, ఉత్సవ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా రబీ పంట నమోదు

**– వ్యవసాయ అధికారులకు జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ శిక్షణ**

**చిత్తూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** క్షేత్ర స్థాయి పంట పొలాల్లో రైతు వేసిన ప్రతి పంటను పక్కాగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ జెడి కార్యాలయంలో బుధవారం రబీ 2025–26 ఈ–పంట జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమానికి వ్యవసాయ ఎడిలు, ఎఓలు, జిల్లా, డివిజన్ స్థాయి మాస్టర్ ట్రైనర్లు హాజరయ్యారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జెడి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రం సిబ్బంది వారి పరిధిలో పంట సాగు చేసిన రైతుల పొలాల వద్దకు వెళ్ళి జిపిఎస్ బేస్డ్ క్రాప్ బుకింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి పొలంలో జియో కో–ఆర్డినేట్స్‌ను వినియోగించి భూమి సర్వేనెంబర్ ప్రకారం రైతు ఏ పంట వేశారు! ఎంత విస్తీర్ణంలో పంట సాగు చేశారు! అంచనా విస్తీర్ణం ఎంత! తదితర వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. ఈ మేరకు సేకరించిన వివరాల మేరకు రైతుకు ఎకైనా ప్రతికూల పరిస్థితులు ఎదురై పంట నష్టం జరిగితే పంట ఇన్సురెన్స్ చెల్లించడానికి, అలాగే రైతు సాగు చేసిన పంటను కొనుగోలు చేయడానికి, పంట విస్తీర్ణం అంచనా వేయడానికి ఉపయోగపడుతాయన్నారు. ఈ శిక్షణామండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా విద్యార్థులు

**గుడిపాల, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని చిత్తూరు డిఎస్పీ సాయినాథ్ పిలుపునిచ్చారు. స్థానిక సిఎన్‌ఆర్ కళాశాలలో బుధవారం డ్రగ్స్, బాల్యవివాహాలు, డిజిటల్ అరెస్టులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చిత్తూరు డిఎస్పీ సాయినాథ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడకంతో మెదడుపై తీవ్ర ప్రభావం పడి శరీరంను పూర్తిగా బలహీనం చేస్తుందన్నారు. కుటుంబాలు, స్నేహితులతో సంబంధాలు పూర్తిగా చెడిపోతాయన్నారు. వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళు చట్టంలో లేని డిజిటల్ అరెస్టులను ఆసరాగా చేసుకుని ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఎవరైనా మోసపోయినట్లు గ్రహిస్తే సత్వరం నేషనల్ సైబర్ క్రైమ్ లేదా 1930 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. అలాగే బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, దీనిపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.ఎస్ఐ రామ్మోహన్, కళాశాల కరెస్పాండెంట్ లోకేష్, ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరువులో పురిటి బిడ్డ మృతదేహం



**బంగారుపాళ్యం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** తల్లి ఒడిలో వెచ్చగా పడుకోవాల్సిన ఓ పురిటి బిడ్డ శవమై చెరువులో కనబడింది. ఈ సంఘటన మండలంలోని తుంబకుప్పం గ్రామ సమీపం బక్కిరెడ్డి చెరువులో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పురిటి కాన్పు అయిన వెంటనే ఆడ శిశువును ఆ తల్లి చెరువులో పడవేసింది. ఉదయం పశువుల కాపర్లు చెరువులో తేలుతున్న పసికందు మృతదేహంను గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శిశువు మృతదేహంను శవ పరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆడ శిశువు కావడంతో మగ సంతానం కోసం వేచి వుండి ఆడ శిశువును కని బతుకు భారమై మృత్యువు ఒడికి తల్లి చేర్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు



**చిత్తూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త ప్రతినిధి** ప్రపంచవ్యాప్తంగా దేశంలో ఒకేసారి ఒకే రోజున జరుపుకునే క్రిస్మస్ వేడుకలను శ్రీ విశ్వం పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాం డెంట్లు జై చంద్రారెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒకే రోజున నిర్వహించే ఏకైక జన్మదిన వేడుకలు ఏదైనా ఉంది అంటే అది ఒక్క ఏసుప్రభు జన్మదిన వేడుకలను క్రిస్మస్ రూపంలో నిర్వహిస్తారని తెలిపారు. ఏసుప్రభు జననం ప్రపంచ మానవాళికి పాప పరిహారాన్ని క్షమాగుణాన్ని శాంతిని ప్రతిబిం బించేలా ఉంటుందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. అలాగే శాంతికి ప్రతిరూపంగా ఏసుప్రభు ఎన్నో అద్భుత కార్యాలు చేశారని, ఇది చరిత్రలో ఒక మైలురాయని కొనియాడారు. కేక్ కట్ చేసి ఘనంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు.

# ప్రపంచ వ్యాప్తంగా నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు

సూళ్లూరుపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త
ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ విజయంతో బ్లూబర్డ్ బ్లాక్2 సహకారంతో ప్రపంచ వ్యాప్తంగా నాణ్యమైన బ్రాడ్ బ్యాండ్ సేవలు అందుతాయని బుధవారం ప్రయోగ విజయానంతరం ఎన్ఎస్ఐఎల్ సిఎండి ఎం.మోహన్, ఎఎస్‌టి స్పేస్ మొబైల్ అసిస్టెంట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శాంతిభూషణ్ గుప్తాలు సంయుక్తంగా విలేఖరులతో మాట్లాడారు. ఎన్ఎస్ఐఎల్ సిఎండి మోహన్ మాట్లాడుతూ 610 టన్నుల బరువు గల ఉపగ్రహాన్ని భారత భూభాగం నుంచి ఇస్రో ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ ద్వారా ప్రయోగించిందని అన్నారు. ఈ ప్రయోగంతో వాణిజ్య ప్రయోగాల్లో భారత్ సత్తా చాటిందని చెప్పారు. దీంతో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఎఎస్‌టి అసిస్టెంట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శాంతి భూషణ్ గుప్తా మాట్లాడుతూ బ్లూబర్డ్ బ్లాక్2 ఉపగ్రహం సహకారంతో టవర్లు లేకుండానే స్మార్ట్ ఫోన్లకు 4జీ, 5జీ సేవలు లభ్యమవుతాయని చెప్పారు. ఈ మిషన్‌ను పూర్తి చేసేందుకు సుమారు 21 నుంచి 22 మిలియన్ల డాలర్లు వ్యయమైనట్లు తెలిపారు. భవిష్యత్‌లో 40 నుంచి 60 శాటిలైట్ ప్రయోగాలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. త్వరలో 5 ప్రయోగాలు జరుగుతాయని తెలిపారు. భారత భూభాగం నుంచే కాకుండా ప్రపంచంలో భారీ రాకెట్ ప్రయోగాలు నిర్వహించే దేశాల సహకారం తీసుకుంటామని శాంతిభూషణ్ గుప్తా వెల్లడించారు. ఎల్‌విఎం3-ఎం6 ప్రయోగం నిర్వహించడంలో ఇస్రో శాస్త్రవేత్తలు అందించిన సహకారం మరువలేనిదని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రయోగాలకు ఇస్రో సహకారం తీసుకుంటామని ఆయన తెలిపారు.





## షార్‌లో కోలాహలం

ఎల్‌విఎం3-ఎం6 ద్వారా బ్లూబర్డ్ ప్రయోగం నిర్వహిస్తుండటంతో బుధవారం ఉదయం చలిని సైతం లెక్కచేయకుండా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, సందర్శకులు శ్రీహరికోటలోని విజిటర్స్ గ్యాలరీకి చేరుకున్నారు. రాకెట్ కౌంట్‌డౌన్ పూర్తయిన తర్వాత నింగికి నిప్పులు చెరుగుతూ ఎగరడంతో పెద్దఎత్తున కరతాళ ధ్వనులు చేస్తూ భారత జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. శ్రీహరికోట ప్రాంతమంతా కోలాహలంగా మారింది. అలాగే ప్రయోగాన్ని మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో మాజీ ఛైర్మన్లు రాధాకృష్ణన్, కిరణ్‌కుమార్, ఇతర శాస్త్రవేత్తలు ఉత్కంఠగా ప్రయోగాన్ని తిలకించి, ప్రయోగం విజయవంతం కావడంతో ఒకరినొకరు అభినందించుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ప్రయోగం విజయం అనంతరం మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తల వద్దకు వెళ్లి కరచాలనం చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. అలాగే ఈ విజయం క్రిస్మస్, నూతన సంవత్సర బహుమతిగా ఇస్రో భారత ప్రజలకు అందించిందని ఛైర్మన్ తెలిపారు.

## నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

### - డిఎల్‌డిఓ వాణి రెడ్డి



బాలాయపల్లి, డిసెంబర్ 24, ప్రభాతవార్త
గ్రామాల్లో నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని డిఎల్‌డిఓ రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో డిఎల్ డిఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్ డిఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆన్లైన్లో ఇంటి పన్నులు చెల్లించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. 100 శాతం ఇంటి పన్నులు సకాలంలో చెల్లించేలా పంచాయితీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీల వారీగా ఇప్పటివరకు ఎంత ఇంటి పన్నులు వసులు చేసారో అడిగి తెలుసుకొన్నారు. సకాలంలో ఇంటి పనులు చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీలలో గ్రామ కంటాలను గుర్తించి ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. వాటికి అర్హులకు హక్కు కల్పిస్తామని తెలిపారు. సుమిత్ర యాప్ పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు



సూళ్లూరుపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త
భారత కార్తిని అంతరిక్ష రంగంలో, ప్రపంచ దేశాల్లో గొప్పగా చాటిచెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం అభినందనలు తెలిపారు. ఇస్రో శాస్త్రవేత్తలు సమష్టి కృషితో ఎల్‌విఎం3-ఎం6 ప్రయోగాన్ని విజయవంతం చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీహరికోట సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో ఉండటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని తెలిపారు. మరెన్నో ప్రయోగాలు చేసి విజయాలు అందుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అలాగే మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్‌లు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

## విద్యార్థులకు విజయ దీపిక పుస్తకాలు పంపిణీ

వాకాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త



మండల కేంద్రమైన వాకాడు ఎస్ఎఎల్‌సి ఈఎఫ్ ప్రభుత్వ పాఠశాలలోని 10వ తరగతి చదువుతున్న పిల్లలకు మండల టిడిపి కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా విజయ దీపికా స్టడీ మెటీరియల్ అను పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్టీ కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ వాకాడు పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రపంచంలో నలుమూలల స్థానంలో ఉండారన్నారు, జిల్లాలోనే ప్రథమ స్థానంలో మంచి మార్కులతో సాధించాలని ఆయన పిల్లలను ఆశీర్వదించారు. సమావేశంలో ఎంపీడీవో సాయిప్రసాద్, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంఈఓ లు ఆనంద్, నసీం అలీ, ప్రధాన ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పిల్లలు తదితరులు ఉన్నారు.

## వెంకటగిరిని దేశ స్థాయిలో గుర్తింపు తెచ్చిన అంధ క్రీడాకారులు

### - ఎమ్మెల్యే రామకృష్ణ



వెంకటగిరి, డిసెంబర్ 24, ప్రభాతవార్త
అంధ క్రీడాకారులు వెంకటగిరి దేశస్థాయిలో చాటారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. 14వ జాతీయ అంధుల జూడో పోటీలలో సత్తా చాటిన శేషగిరిని ఎమ్మెల్యే సత్కరించారు. వెంకటగిరి ఎమ్మెల్యే బ్లైండ్ ప్లేయర్ సత్కారం. శేషగిరి అంధ క్రీడాకారుల టీం వైస్ కెప్టెన్‌గా వ్యవహరించడం అభినందన దగ్గర విషయం అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన రాష్ట్ర క్రీడాకారులు రాజస్థాన్ వేదికగా జరిగిన జాతీయ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం 11 మంది క్రీడాకా రులు పాల్గొనగా 1 బంగారు పతకం, 6 వెండి పతకాలు, 2 కాంస్య పతకాలు సాధించడం మన రాష్ట్రా నికి గర్వకారణం అన్నారు. బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెంచల నరసయ్య, ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు, సిఐ ఏవి రమణ, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే మానవుడు ఆరోగ్యంగా ఉంటారు

బాలాయపల్లి, డిసెంబర్ 24, ప్రభాతవార్త
ప్రకృతి వ్యవసాయంతోనే మెరుగైన జీవనశైలి, మంచి ఆరోగ్యం సాధ్యమని వెలుగు ఏ.పి.ఎం. వై కిరణ్ తెలిపారు. బాలాయపల్లి వెలుగు కార్యాలయంలో జరిగిన రైతు సాధికార సంస్థ మండల మహిళా సమాఖ్య సంయుక్త ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం, చిరుధాన్యాల పెంపకం, వ్యవసాయంలో మెలుకువలు పై ప్రకృతి వ్యవసాయ, పాదువు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏ.ఓ. విజయలక్ష్మి మాట్లాడుతూ యూరియా, ఫాస్పేట్, గుళికలు ఇతర పురుగుమందులో వినియోగం వల్ల మానవుల, జంతువుల ఆరోగ్యం ప్రభావానికి గురవుతాయని, వాడకూడదని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతమై, అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.శివశంకర్, సిహెచ్ సౌందర్య బాబు, ఎస్.పెంచలయ్య, సీసీలు మాధవి, రత్నం, మమత, విఏఏ, విఓఏలకు, ఎంఎలకు, ఎంహెచ్ఏలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



గూడూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త :రీజినల్ కమిటి పిలుపు మేరకు తిరుపతి రీజియన్‌లో 01/2019 సర్క్యులర్ అమలు కోసం చేసే పోరాటంలో బాగంగా డిపో ప్రెసిడెంట్ పీడి ప్రవీణ్, డిపో సెక్రటరీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గూడూరు ఆర్డీవో కార్యాలయంలోని ఉద్యోగికి మెమోరండం అందజేసారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జోనల్ చీఫ్ అడ్వైసర్ ఎస్.కె. ఎం అహ్మద్, రీజనల్ జాయింట్ అసిస్టెంట్ సెక్రటరీ శ్రవణ్, రీజనల్ జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు సభ్యులు ప్రభాకర్, పోలయ్య,

# గూడూరు డివిజన్

## ఎన్‌సిఆర్ సేవలు చిరస్మరణీయం



కోట, డిసెంబర్ 24 ప్రభాతవార్త
దివంగత జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉమ్మడి నెల్లూరు జిల్లాకు అందించిన సేవలు చిరస్మరణీయమని నల్లపరెడ్డి అభిమానులు అన్నారు. బుధవారం నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి 99వ జయంతి సందర్భంగా కోటలోని మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి నివాసంలో వేడుకలు నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సేవలను కొనియాడారు. ఆయన రాజకీయ జీవితమంతా ప్రజా శ్రేయస్సుకే అంకితమైందని చెప్పారు. శతజయంతి సందర్భంగా కోటలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపిటిసి మొబిన్‌బాషా, షిరిడి సాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య కోరారు. నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, జెమ్మి ప్రసాద్, అహ్మద్‌బాషా, కరిముల్లా, ఆనంద కృష్ణమూర్తి, అద్దాల చంద్రయ్య, ఆవుల సుబ్బయ్య, షేక్ ఇంతియాజ్, వ్యాపారులు, స్వచ్ఛంధసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు విరివిగా రుణాలు: సొసైటీ ఛైర్మన్



కోట, డిసెంబర్ 24 ప్రభాతవార్త
కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం దిశగా పయనిస్తుందని కోట మండలం చిట్టేడు సొసైటీ ఛైర్మన్ చాపల శ్రీనివాసులు అన్నారు. బుధవారం చిట్టేడు సొసైటీలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 నెలలుగా కూటమి ప్రభుత్వం రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందజేసిందన్నారు. సొసైటీ నుంచి విరివిగా రుణాలు పొందాలని, తిరిగి సకాలంలో చెల్లించి సహకార బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సిఇఓ కరుణాకర్‌రెడ్డి, టిడిపి నాయకులు చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## హిందువులంతా ఐక్యంగా ఉండాలి



కోట, డిసెంబర్ 24 ప్రభాతవార్త
భారతదేశంలో హిందువులు ఐక్యంగా లేకపోవడంతోనే హిందువుల దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని కమలానంద భారతి స్వామీజీ అన్నారు. బుధవారం కోటలో కోటమ్మ ఆలయం వద్ద హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని స్వామీజీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్ల ప్రయాణంలో విజయగాధలను వివరించారు. ఈ కార్యక్రమంలో కోట సునీల్‌కుమార్, ఆనందరెడ్డి, పురుషోత్తమరెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మత్స్యకార సోదరులతో సమావేశం



తడ, డిసెంబర్ 24 ప్రభాతవార్త
రాష్ట్ర మత్స్యకార సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన్ శ్రీధర్, బుధవారం తడ మండలం మత్స్యకార గ్రామాలలో పర్యటించారు. మత్స్యకారులతో సమావేశమయ్యారు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా మత్స్యకారులకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు బీవీ పాలెం పడవ రేవు ద్వారా ఇరకం దీనికి చేరుకొని మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారివెంట ఎఫ్ డి ఓ మహిజ మత్స్యకార నాయకులు జైపాల్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల పోటీల్లో గోకులకృష్ణ విద్యార్థుల ప్రతిభ



సూళ్లూరుపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త
సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రెండురోజుల పాటు గూడూరు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రథమ బహుమతులు అందుకున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం బహుమతులు అందుకున్న విద్యార్థులను ప్రత్యేకంగా కళాశాల యాజమాన్యానికి సంబంధించి బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్, ఎఓ మనోహర్ తదితరులు అభినందించారు. కబడ్డీ, చెస్, కోకోతో పాటు షటిల్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, 400 మీటర్ల పరుగుపందేలు, హైజంప్‌లలో గోకులకృష్ణ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రథమ బహుమతులు అందుకున్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం : సీఐ కిషోర్ బాబు

గూడూరు రూరల్, డిసెంబర్ 24, ప్రభాతవార్త :చదువుల్లో ఉన్నత ర్యాంకులు సాధించాలని లక్ష్యంతో విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారని మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తూ ఉన్నత స్థాయికి వెళ్లాలని గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్, ది గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ ను రూరల్ సీఐ కిషోర్ బాబు ప్రారంభించారు. డాక్టర్ జనార్దన్ రెడ్డి,వెంకటేశ్వర రెడ్డి, ముని గిరీష్, శ్రీధర్ రెడ్డి, బాలకృష్ణం రాజు, అనిల్, పివి కృష్ణయ్య ,సురేందర్ రెడ్డి, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి కార్మికుల సమస్యలపై తహశీల్దార్‌కు వినతి

వాకాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త
ఆర్టీసి కార్మికుల సమస్యల పై వాకాడు తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌కు ఆర్టీసీ కార్మికులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ప్రశాంత్ బాబు, సంపత్, ఆర్టీసీ నాయకులు పలు సముద్రపు పలు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలుపుతూ సంబంధించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తహసిల్దార్ తెలిపారు. అన్ని బస్సులలో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేసేలా చూడాలని, తిరుమల - తిరుపతి మధ్యన నడుస్తున్న వన్‌మ్యాన్ సర్వీసులకు టిఐఎం - 141 కార్డుల ప్రకారం టైమింగు నిర్ణయించి నడిపేలా చూడాలని విన్నవించారు. జిల్లాలోని అన్ని డిపోల నుండి తిరుమలకు ప్రయాణీకుల సౌఖర్యం కోసం నేరుగా సర్వీసులను నడపాలని పేర్కొన్నారు. చంద్రగిరి - రేణిగుంట మార్గంలో గతంలో నడుపుతూ నిలిపివేసిన సిటీ సర్వీసులను ప్రయాణీకులకు మెరుగైన రవాణా సౌఖర్యం కోసం తిరిగి పునరుద్దరించి నడపాలని తెలిపారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.60 కోట్లు ఆదాయం



కాణిపాకం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.60 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. బుధవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా 19 రోజులకు హుండీల ద్వారా 1,60,25,165 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 16 గ్రాముల బంగారు, ఒక కిలో 650 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 13,316 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 25,720 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 636 అమెరికా డాలర్లు, 5 యూఏఈ దినార్స్, 370 ఆస్ట్రేలియా డాలర్లు, 20 ఇంగ్లాండ్ ఫౌండ్స్, 23 మలేషియా రింగిట్స్,162 సింగపూర్ డాలర్లు,185 సౌదీ రియాల్స్ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. దేవస్థానం ఛైర్మన్ వి.మణినాయుడు, దేవాదాయశాఖ జిల్లాఅసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, ఏఈఓలు రవీంద్రబాబు, ప్రసాద్, ధనుంజయ, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## శివయ్య హుండీ ఆదాయం రూ.1.3కోట్లు



శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరునికి సంబంధించిన హుండీల ఆదాయం 19రోజులకు రూ.1,31,65,590లు వచ్చినట్లు ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి బుధవారం వివరించారు.ఇటీవల శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంస్కరణలు అమలు చేయటంతో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు పెరుగుతున్నాయని ఆయన వివరించారు. బుధవారం రూ.500 రాహుకేతు మండపంలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. హుండీల్లో భక్తులు సమర్పించిన వెండి నాగపడగల రూపంలో వెండి 352కిలోలు రాగా బంగారు 25 గ్రాములు వచ్చినట్లు ఇఒ తెలిపారు.విదేశీ కరెన్సి 71 నోట్లు ఉన్నాయి. విదేశీ కరెన్సిలో అమెరికాకు సంబందించినవి 31 ఉన్నాయని తెలిపారు. లెక్కింపులో తిరుపతి దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ ఫణీంద్ర,ఎఇఒలు హేమమాలిని లోకేస్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్,శ్రీహరి,లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.లెక్కింపుల్లో బోర్డు సభ్యులు కుసుమ కుమారి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## వెంగంపల్లెలో ఆట్టహాసంగా 'ముస్తాబు' కార్యక్రమం ప్రారంభం

తవణంపల్లె, డిసెంబర్ 24 ప్రభాతవార్త:



పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నక్కల ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామమైన మండలంలోని వెంగంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ముస్తాబు' కార్యక్రమంను బుధవారం ఆట్టహాసంగా ప్రారంభించారు.విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశు భ్రత, క్రమశిక్షణ, లీడర్‌షిప్ ను పెంపొందించడానికి పార్వతీపు రం మన్యం జిల్లాల్లో కలెక్టర్ నక్కల ప్రభాకర్‌రెడ్డి వినూత్నంగా ప్రవేశపెట్టి అమలు చేస్తూ రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు నుండి ప్రసంశలందుకున్న ముస్తాబు కార్యక్రమంను కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామం వెంగంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఎంఈఓ ఎ.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని కలెక్టర్ తల్లిదండ్రుల చేతుల మీదుగా ప్రారంభించారు.గ్రామానికి చెందిన జి.చంద్రశేఖర్‌రెడ్డి ఈకార్యక్రమం అమలుకు కావలసిన సామాగ్రిని విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా జిల్లా పీఆర్‌టియు జిల్లా ప్రధాన కార్య దర్శి విజయ భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షులు బాలచంద్రారెడ్డిలు మాట్లాడుతూ ముస్తాబు కార్యక్రమం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,

## ఇస్రో శాస్త్రవేత్తలకు శ్రీసిటీ ఎండీ అభినందనలు

సత్యవేడు, డిసెంబరు 24 ప్రభాతవార్త:
ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు.ఈ ప్రయోగం ద్వారా అమెరికాలోని ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 అతి పెద్ద వాణిజ్య కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని తక్కువ భూకక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టేందుకు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్, ఇతర షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఈ విజయం ద్వారా అంతరిక్ష పరిశోధన రంగంలో భారతదేశం తన ఆధిపత్యం చాటుకోవడంతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక మిషన్లకు శ్రీహరికోట కీలక వేదికగా మరోసారి నిరూపించబడిందని ఆయన వ్యాఖ్యానించారు.

## ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు



చిత్తూరురూరల్, డిసెంబరు 24 ప్రభాతవార్త:
చిత్తూరుపట్టణం, సంతపేటలోని బృందావన్ సీనియర్ సెకండరీ పాఠశాలలో బుధవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలను పాఠశాల వ్యవస్థాపకులు శైలజకుమారి, డైరెక్టరు ప్రియతేజ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏసుప్రభువు జననం తదితర విషయాలను పాటల, నృత్యరూపంలో ప్రదర్శించారు. వీరితో పాటు క్రిస్మస్‌తాత విద్యార్థులతో కలసి ఆడుతూపాడుతూ పిల్లలకు మిఠాయిలు పంచుతూ ఆనందంగా గడిపారు. క్రిస్మస్ ట్రీ విద్యార్థులను అమితంగా ఆకట్టుకొంది.

## సమస్యలు పరిష్కారానికే ప్రజా దర్బార్: ఎమ్మెల్యే కోనేటి

కేవీబీ పురం, డిసెంబరు 24 ప్రభాతవార్త:



సమస్యలు పరిష్కారానికేప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. బుధవారం ఉదయం కేవీబీ పురంలో ఎమ్మెల్యే నేతృత్వంలో ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పట్టణాలతో పాటు మారుమూల గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకి అందించారు. మొత్తం 140 అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే చిన్న సమస్యలను అక్కడే ఉన్న ఎంపీడీవో, తహసీల్దార్, ఇతర శాఖలకు చెందిన అధికారుల ద్వారా తక్షణ పరిష్కార మార్గం చూపగా పెద్ద సమస్యలను జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి వారం లోపల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజా దర్బార్‌కు వచ్చిన అర్జీ దారులకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా ప్రారంభించారు. చివరిగా క్రైస్తవ సోదరులతో కలసి ఎమ్మెల్యే క్రిస్మస్ కేక్ కట్‌చేసి అందరికి పంచుతూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్, డిప్యూటీ ఎంపీడీవో, డీఈ, మండలానికి చెందిన ఇతర శాఖల అధికారులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్‌లో ఎస్వీయూ ఓవరాల్‌ఛాంపియన్‌షిప్

తిరుపతి యూనివర్సిటీక్యాంపస్,,డిసెంబర్ 24, ప్రభాతవార్త





చెన్నైలో జరిగిన 39వ దక్షిణ భారత యూత్‌ఫెస్టివల్-2025లో తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యార్థులు ఓవరాల్ ఛాంపి యన్స్ అందుకున్నారు. అన్ని అంశాల్లో తిరుపతి ఎస్వీయూ విద్యార్థులు ప్రతిభచూపారని ఎస్వీయూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ కల్చరల్ అఫైర్స్ కల్చరల్ కో ఆర్డినేటర్ డాక్టర్ వివేక్ పత్తిపాటి తెలిపారు. విద్యార్థులను ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య టాటా నర్సింగ్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతినాయుడు అభినందించారు.

## జిల్లా దేశం కమిటిలో శ్రీకాళహస్తికి చోటు

### పదవులున్న వారికే మళ్ళీ అవకాశం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త
తెలుగుదేశం కమిటిలో శ్రీకాళహస్తికి చెందిన నలుగురికి అవకాశం లభించింది. ఇందులో ఇద్దరికి ఇప్పటికే పదవులుండగా మళ్లీ అవకాశం లభించిందని తెలుగుతమ్ముళ్లు గుస గుస లాడుతున్నారు. కమిటి కూర్పులో పార్టీ చేపట్టిన అంచనాలు ఏమిటో ఏమో కానీ తెలుగుతమ్ముళ్లో అసంతృప్తి చోటు చేసుకుంది. నామినేటెడ్ పదవులున్నవారికే మళ్ళీ అవకాశం కల్పిస్తే పార్టీ కోసం పని చేసిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.పార్టీ అధిష్టాన వర్గం ప్రకటించిన జిల్లా స్థాయి పార్టీలో శ్రీకాళహస్తికి చెందిన వారిలో పార్లమెంటు పార్టీ ఉపాధ్యక్షుడుగా చెంచయ్యనాయుడుకు అవకాశం కల్పించారు. అయితే ఆయనకు గతంలో అదే పదవి ఉండగా ప్రస్తుతం మార్కెట్ కమిటి ఛైర్మెన్‌గా ఉన్నారు. అలాగే కూనాటి లోకేశ్వరికి అవకాశం లబించింది.కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏర్పేడుకు చెందిన గాలి కృష్ణవేణికి అవకాశం వచ్చింది. ఆమె మండల అధ్యక్షురాలుగా ఉన్నారు.అధికార ప్రతినిదిగా వి.అనితలకు అవకాశం వచ్చింది.కార్యదర్శిగా శ్రీకాళహస్తికి చెందిన వెంకటసుబ్బయ్యకు అవకాశం లభించింది.ఆయన ఇప్పటికే పార్టీ పదవిలో ఉన్నారు. ప్రస్తుతం పదవులు పొందిన వారందరూ స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కనుసన్నల్లో మెలిగే వారే. అయితే పలు మార్లు ఎంఎల్ఏ పార్టీ కోసం పాటు పడిన వారి ఇళ్ళకు పదవులు వెతుక్కుంటూ వస్తాయని ప్రకటించిన విషయం విదితమే. అయితే జిల్లా పార్టీ కూర్పులో పార్టీ అధిష్టాన వర్గం నిర్ణయం తెలుగుతమ్ముళ్లలో విస్మయం కల్గించింది.శ్రీకాళహస్తి నియోజకవర్గం తరపున పదవులు పొందిన వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.


## చెరువు వేలం ప్రకటన

తిరుపతి జిల్లా, దక్కిలి మండలం, మాదవాయపాళెం పంచాయతీ పరిధిలోని మాదవాయపాళెం చెరువులో చేప పిల్లలు వేసి పెంచుకుని, అమ్ముకునే హక్కులను **1435** ఫసలీకి గాను**(1-7-2025** నుండి **30-6-2026)** వరకు బహిరంగ వేలం పాట నిర్వహించబడును. తేది : **27-12-2025** శనివారం ఉదయం **11**గంటలకు సర్పంచ్ గారి అధ్యక్షన మాదవాయపాళెం గ్రామ సచివాలయం నందు వేలం పాట నిర్వహించబడును. వేలం పాటలో పాల్గొనే వారు రు.**15,250/-** దరావత్తు చెల్లించవలెను.

సం/- పంచాయతీ కార్యదర్శి,
మాదవాయపాళెం గ్రామ పంచాయతీ,
దక్కిలి మం॥ తిరుపతి జిల్లా